

# కాలప్రభావం

వాణిశ్రీ

జట్కా బండి సీతమ్మ ఇంటి ముందు ఆగింది.

ఇరుగుపొరుగు ఆడవాళ్ళు వాకిళ్ళలోకి వచ్చి చోద్యం చూస్తున్నారు సీతమ్మ ఇంటికి వచ్చిన చుట్టం ఎవరా అని.

జట్కాలోంచి దిగింది సీతమ్మ కోడలు ప్రమీల.

కోడల్ని చూస్తూనే నివ్వెరపోయింది సీతమ్మ.

"బాగున్నావా అత్తయ్యా ?" అంటూ పలకరించింది ప్రమీల.

ఆమె పలకరింపుతో తేరుకుని "ఆఁ... బాగున్నానమ్మా! అబ్బాయిా! పిల్లలూ క్షేమమేనా ? బుజ్జిగాడు బడికి వెళ్తున్నాడా లేక పేచీపెడుతున్నాడా ?" అంది.

అత్తాకోడళ్ళు కుశల ప్రశ్నలు వేసుకుంటూ వుండగా "ప్రమీలా! బాగున్నావా ? ఇన్నేళ్ళకి మా వూరు గుర్తొచ్చిందన్నమాట !" అంటూ ఇరుగుపొరుగు ఆడవాళ్ళు వచ్చి ఇంట్లో తిష్ఠవేశారు.

* * *

"కోడలు ఏం చేస్తూవుంది సీతమ్మొదినా!" రహస్యం అడుగుతున్నదానిలా అంది కాంతమ్మ వస్తూనే.

"అన్నంతిని పడుకుంది. దూరం నుంచి వచ్చిందికదూ పెందరాళే నిద్రపోయింది" అంది సీతమ్మ.

"ఎందుకొచ్చిందట ?" అంది కాంతమ్మ.

"ఏమో! ఇంకా చెప్పలేదు. ఏదో పెద్ద పని మీదే వచ్చివుంటుంది. ఇక్కడ నేనేదో సుఖపడిపోతున్నానని పొలం అమ్మి డబ్బు ఇవ్వమంటుందేమో ?" అంది సీతమ్మ దిగులుగా.

"పొలం అమ్మితే మన్నేం తింటావు? అడుక్కుతింటావా ? నీ కొడుకు వూరుకోడులే."

"వాడిదేవుంది. పిచ్చినన్నాసి. అంతా దీని పెత్తనమేగా. ఆమధ్య వాతో అననే అంది. ప్రతి ఏడా తుఫానులు రామా పంట వూడ్చుకుపోమా మనకేం మిగులుతుంది ? పొలం అమ్మేసి ఆ డబ్బు బ్యాంకిలో వేస్తే బోలెడు వడ్డీ వస్తుంది అని."

"అయితే ఆ పని మీదే వచ్చివుంటుందంటావా ?" ఆశ్చర్యంగా అంది కాంతమ్మ.

"లేకపోతే ఇంకేం పని వుంది దానికి? నన్ను తీసుకెళ్ళడానికి వస్తుందంటావా ?" వ్యంగ్యంగా నవ్వింది సీతమ్మ.

"ఆమాత్రం ప్రేమే వుంటే నీతో పోట్లాడి ఎందుకు తరిమేస్తుంది ? హాయిగా కొడుకు దగ్గరే మనవల్తో సుఖంగా వుండేదానివే గదా ?" అంది కాంతమ్మ.

"ఎంతయినా పట్నం పిల్లగదా! మనమంటే ఎందుకు పడుతుంది."

"పడకపోతే నీకేం దిగులు? వాళ్ళేం పెట్టి పోషిస్తున్నారా! పిచ్చినాగానీ పొలం అమ్మడానికి ససేమిరా ఒప్పుకోకు." హెచ్చరించింది కాంతమ్మ.

"నా గొంతులో వూపిరుండగా ఒప్పుకుంటానా ?" రోషంగా అంది సీతమ్మ.

* * *

మర్నాడు ప్రొద్దున్నే కోడలు నిద్రలేవకముందే పప్పు రుబ్బి గారెలు చేసింది సీతమ్మ.

"నీ కిష్టమని గారెలు చేశానమ్మాయ్! సాయంకాలం కజ్జికాయలు చేస్తా!" అంది సీతమ్మ ప్రమీల లేవగానే.

"ఎందుకత్తయ్యా! శ్రమపడొద్దు. మనం సాయంత్రం బయల్దేరిపోవాలిగదా !" అంది ప్రమీల.

"ఎక్కడికి ?" ఆశ్చర్యపోతూ అంది సీతమ్మ.

"ఎక్కడికేమిటి ? మన ఇంటికే. అత్తాకోడలన్నాక మాటా మాటా అనుకోకుండా ఎవరుంటారు ? నేనేదో అన్నానని చెప్పాపెట్టకుండా వూరెళ్ళిపోయినందుకు నేనెంత బాధపడ్డానో తెలుసా? మీ అబ్బాయి నన్ను చెడామడా తిట్టి ఆ పూట భోజనం చెయ్యకుండా పడుకున్నారు. అయినా ఈ వయసులో ఈ పల్లెటూళ్ళో ఒంటరిగా ఎందుకుండాలి ? మేమంతా లేమూ ? పిల్లలు మామ్మ ఎక్కడికెళ్ళిందని ? ఎప్పుడొస్తుందని ? ఒకటే గొడవ..."

కోడలు చెప్పే మాటలు వింటూనే గాలి కొడుతున్న రబ్బరు బెలూన్‌లా పుబ్బిపోసాగింది సీతమ్మ.

పొలం గురించి ఒక్క మాట అనలేదు ప్రమీల. తన వూహలు తారుమారైనందుకు సీతమ్మ ఆశ్చర్యానికి అవధులు లేవు.

ఆఖరికి ప్రమీలే అంది "ఎవరికన్నా కౌలుకు ఇచ్చేయండి అత్తయ్యా!" అని.

కోడలు ఏం మంత్రం వేసిందోగాని పాత సంగతులన్నీ మర్చిపోయింది సీతమ్మ. సాయంకాలం కోడలితోపాటు పట్నానికి ప్రయాణమైంది సీతమ్మ.

జట్కా బండివెంట వూరి చివరివరకూ వచ్చి వీడ్కోలు యిచ్చారు బంధువులు, సన్నిహితులూను.

"ఎంత పోట్లాడుకున్నా అత్తాకోడలూ ఒక్కటే. అత్తంటే ప్రమీలకు ప్రేమే" అంది కాంతమ్మ.

ఆమె మాటలకు అందరూ ఔనన్నారుగాని ఆమె చిన్నకొడుకు రఘు మాత్రం పకపకా నవ్వాడు తల్లి మాటలు విని.

తను అన్నదాంట్లో అంత నవ్వొచ్చిన సంగతి ఏముందో ? కాంతమ్మకి అర్థంకాలేదు.

"ఎందుకురా పిచ్చాడిలా అట్లా నవ్వుతున్నావు ?" అంటూ కొడుకుని కసిరింది కాంతమ్మ.

"కోడలికి అత్తమీద ప్రేమంటేమ నవ్వొచ్చింది. అసలు సంగతి మీకు తెలియదు. కోడలికి ఆపదలో అత్తగారు గుర్తొచ్చింది."

"ఏవిట్రా నీ మాటలు ?"

"మొగుడూ, పెళ్ళాం ఇద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారుగదా ?"

"అవునూ. ఇప్పుడు వాళ్ళకి ఏం ఆపద ముంచుకొచ్చింది ?" అంది కాంతమ్మ.

"ఇప్పుడేమో ఆఫీసుకి వెళ్ళే టైము మార్చారు గవర్నమెంటువాళ్ళు. ప్రొద్దున్నే ఏడున్నరకి వెళ్తే ఇక మధ్యాహ్నం రెండుంబావుకే వదిలేది."

"అయితేమాత్రం ఏం ? తెల్లవారుజామునే లేచి క్యారేజీలు పట్టుకువెళ్తారు" అంది కాంతమ్మ.

"మరి పిల్లల్ని ఎవరు చూస్తారు ? వాళ్ళు తొమ్మిదింటికి గదా బడికి వెళ్ళేది. అందుకే అత్తని తీసుకెళ్తున్నది" అన్నాడు రఘు నవ్వుతూ.

అంతా తెల్లముఖాలు వేశారు. ●